క్లుప్తంగా

ఘనంగా సంకష్టహర చతుర్థి


పూజలో పాల్గొన్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: సంకష్టహర చతుర్థి పర్వ దినాన్ని పురస్కరించుకొని రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో శనివారం రాత్రి సంకష్టహర చతుర్థి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆలయంలోని గణపతి మూలవిరాట్‌కు ఫల పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు హారతి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్యదర్శికి సన్మానం


సన్మానిస్తున్న మాజీ సర్పంచ్, గ్రామస్తులు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గొల్లపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ప్రమోద్‌కుమార్‌ను ఆదివారం మాజీ సర్పంచ్ బండారి రమేశ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సన్మానించారు. గ్రామస్తులు రాజు, అంజికుమార్, లక్ష్మయ్య, సంపత్, శంకర్, రజిత, సంపత్‌రావు, రవి ఉన్నారు.

ఎస్‌హెచ్‌వీఎస్ జిల్లా అధ్యక్షుడిగా కుమారస్వామి



రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని అక్బర్‌నగర్‌కు చెందిన చిలువేరు కుమారస్వామి సమాచార హక్కు వికాస సమితి (ఎస్‌హెచ్‌వీఎస్) జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆదివారం సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రమాద కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్థిక చేయూత


నగదు అందజేస్తున్న స్నేహితులు

పెద్దపల్లిరూరల్: తమ చిన్ననాటి స్నేహితుడు అకాలమరణం పొందడంతో మిత్రులంతా కలిసి ఆ కుటుంబానికి చేయూత అందించి అండగా నిలిచారు. పెద్దపల్లి మండలం ముత్తారం శివారు గ్రామమైన ధర్మాబాదకు చెందిన న్యాలం రమేశ్ ఇటీవల మరణించాడు. మిత్రులంతా తలాకొంత పోగేసి రూ.22వేలు సాయంగా అందించారు. మిత్రులు మంథని కృష్ణ, అల్లాడి హరిబాబు, జహంగీర్, ఆంజనేయులు, సాగర్, నల్లగొండ కుమార్, లక్ష్మీరాజం రమేశ్ ఉన్నారు.

బ్లాక్ డే పాటించాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 23న తలపెట్టిన బ్లాక్‌డేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లిముత్యం రావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ కోరారు. పట్టణంలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలోని ఆయా వర్గాలవారు పాల్గొనాలన్నారు. కార్మికుల వేతనం రూ.26వేలకు పెంచాలనే డిమాండ్‌ను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నాయకులు రవీందర్, వెంకటస్వామి, అశోక్, శ్రావణ్ ఉన్నారు.

ఎస్సారెస్పీ కాలువలు శుభ్రం


కాలువను శుభ్రం చేయిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామంలోని (కలెక్టరేట్‌కు సమీపంలో) ఎస్సారెస్పీ కాలువలో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని పంచాయతీ అధికారులు ఆదివారం శుభ్రం చేయించారు.

రోడ్డు వెంటే డంపింగ్

- ప్లాస్టిక్, చెత్త కాల్చివేతతో వాహనదారుల ఇబ్బంది
- మూడు గ్రామాల్లో ఇదే పరిస్థితి

జూలపల్లి: గ్రామాల్లో స్వచ్ఛతే లక్ష్యంగా పంచాయతీల్లో ట్రాక్టర్లు కొనుగోలు చేసి ఆయా గ్రామాల్లో చెత్త సేకరించి ఊరి బయటకు తరలించేందుకు ప్రభుత్వం ఉపాధిహామీ నిధులతో నిర్మించిన డంపింగ్ యార్డులు ఊరికి దూరంగా ఉండడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. గ్రామానికి అందుబాటులో సర్కారు స్థలాలు లేక ఊరిలో వచ్చిన చెత్తను రోడ్డు వెంటనే వేసి కాల్చుతుండడంతో, రోడ్డుపై వెళ్లే వాహనదారులు ప్లాస్టిక్ వాసనతో శ్వాస తీసుకోలేని పరిస్థితి వచ్చింది.

మూడు గ్రామాల్లో..

మండల కేంద్రంతోపాటు కోనరావుపేట, అబ్బాపూర్ గ్రామాల్లో డంపింగ్ యార్డులకు నిధులు మంజూరు కాగా ఆయా గ్రామాల బయట ఊరికి దూరంగా చెత్తను వేరు చేసే షెడ్లు నిర్మించారు. గ్రామంలో వచ్చిన చెత్తను తరలించేందుకు ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్, అవసరమైన సిబ్బందిని ఉంచారు. ప్రతీ రెండు, మూడురోజులకోసారి సేకరించిన చెత్తను కేటాయించిన ప్రదేశంలో వేసి తడి, పొడి చెత్తగా వేరు చేసి సేంద్రియ ఎరువులు తయారు చేయాలన్న ప్రభుత్వ నిబంధనలు అమలు కావడం లేదు. సేకరించిన చెత్తను గ్రామాలకు దగ్గరలోనే వేసి కాల్చుతుండడంతో అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో శ్వాసకోస ఇబ్బందులతో అవస్థలు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. చెత్తను కాల్చకుండా సేంద్రియ ఎరువులుగా మార్చి వాడుకునేందుకు అధికారులు ప్రోత్సహించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


జూలపల్లిలో కొచ్చెరువుకుంట వద్ద రోడ్డుపక్కనే చెత్త కాల్చివేత

కేటాయించిన స్థలంలోనే చెత్త వేయాలి



గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు కేటాయించిన స్థలంలోనే వేయాలి. పర్యవరణానికి ఇబ్బందులు రాకుండా తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువులుగా మార్చి రైతులకు సరఫరా చేయాలి. దీంతో వాతావరణ కాలుష్యం తగ్గడంతో పాటు రైతులకు ఉపయోగపడుతుంది.

– పాటకుల అనిల్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు, జూలపల్లి

కుంటకు పడిన గండి పూడ్చివేత


గండి పూడ్చివేసిన సిబ్బంది

ఎలిగేడు: కొన్నిరోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు మండలంలోని లాలపల్లిలో కొప్పెరవాణికుంట మత్తడికి గండిపడి వరిపొలాలు నీట మునిగాయి. దీంతో రైతులకు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే మరమ్మతు చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో గండి మరమ్మతు పనులు చేపట్టి పూర్తిచేశారు. ఎమ్మెల్యేకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, కొప్పెర తిరుమల్‌రెడ్డి, సింగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆశ్రమానికి వృద్ధుడి తరలింపు


ఆశ్రమంలో చేర్పించిన ఎఫ్ఆర్‌వో స్వర్ణలత

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లి ఈశ్వరకృప వృద్ధాశ్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలతో ఆదివారం కమాన్‌పూర్ మండలం పెంచికలపేటకు చెందిన ముడుపు రాజయ్య(80)ను డీడబ్ల్యూ రాఫ్‌ఖాన్, ఎఫ్ఆర్‌వో స్వర్ణలత వృద్ధాశ్రమంలో చేర్పించారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ముడుపు రాజయ్య కొన్నిరోజులుగా ఎవరూ లేక అనాథగా ఉంటున్నాడు. రాజయ్యకు ఇద్దరు కూతుళ్లు ఉండగా ఒక కూతురు చనిపోగా మరో కూతురు భర్త చనిపోయి ఆర్థికంగా వెనుకబడి ఉన్నట్లు తెలిపారు. వృద్ధుని పోషణ సంరక్షణ నిమిత్తం సఖి వాహనంలో వీర్లపల్లిలోని ఈశ్వరకృప వృద్ధాశ్రమానికి తరలించారు.

ఆల్‌ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్‌లో చేరిక



పెద్దపల్లిరూరల్: ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర నాయకుడు, మాదిగశక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్ సన్నీ ఆదివారం ఆల్‌ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీలో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ప్రస్తుతం సురేందర్ సన్నీ భార్య బొంకూరి భాగ్యలక్ష్మి పెద్దపల్లి మున్సిపాలిటీలో ఎంఐఎం కౌన్సిలర్‌గా ఉన్నారు. రానున్న స్థానికసంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే సురేందర్ సన్నీ ఫార్వర్డ్‌బ్లాక్‌లో చేరి ఉంటారనే చర్చ సాగుతోంది. ఫార్వర్డ్ నాయకులు సురేందర్‌రెడ్డి, శేఖర్‌కు సన్నీ కృతజ్ఞతలు తెలిపారు.

సదయ్యకు జీవిత సాఫల్య పురస్కారం అందజేత



సుల్తానాబాద్: సామాజిక సేవలకు గుర్తింపుగా జీవిత సాఫల్య పురస్కారాన్ని ఏగోళపు సదయ్య గౌడ్‌కు ఆదర్శ కళానిలయం అధ్యక్షుడు చర్ల ప్రకాశ్ అందజేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ భవనంలోఆదర్శ కళానిలయం వార్షికోత్సవం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో సామాజిక సేవలను గుర్తిస్తూ ఆయనకు ప్రశంసపత్రం అందజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం


ట్రోఫీ అందిస్తున్న ఏబీసీ రెడ్డి

జ్యోతినగర్: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టర్ ఏబీసీ రెడ్డి అన్నారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో హెమ్స్ కంపెనీ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆదివారం పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన ఏ గ్రూపును, రన్నర్‌గా గెలిచిన డి గ్రూప్ కెప్టెన్లకు ట్రోఫీలను అందజేశారు.

పెద్దపల్లి మార్కెట్ డైరెక్టర్లుగా నలుగురి నియామకం


కొమురయ్య

ఓదెల: పెద్దపల్లి మార్కెట్ డైరెక్టర్లుగా ఓదెల మండలం నుంచి నలుగురిని నియమిస్తూ రాష్ట్ర మార్కెట్‌శాఖ కార్యదర్శి ఎం. రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. మండలంలోని పిట్టల ఎల్లయ్యపల్లె గ్రామానికి చెందిన పిట్టల కొమురయ్య, ఓదెలకు చెందిన గోపతి సదానందం, గూడెం నుంచి తిప్పారపు ప్రభాకర్, కొలనూర్‌కు చెందిన కొల్లూరి రాంచంద్రంను నియమించారు. తమ నియామకానికి సహకరించిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డికి డైరెక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు బ్లాక్‌డేగా పాటించాలి

గోదావరిఖని: కోవిడ్‌ను అడ్డంగా పెట్టుకుని కేంద్రం మూడు లేబర్ కోడ్‌లను ఆమోదించిన సెప్టెంబర్ 23న బ్లాక్‌డేగా పాటించాలని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్లాక్‌డేగా ప్రకటించి బిల్లు కాపీలను తగలబెట్టనున్నట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **ఓదెల మల్లన్న సన్నిధిలో పూజలు**

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో భక్తులు ఆదివారం పూజలు చేశారు. జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన ఓదెల మల్లన్న దర్శనం కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చారు. భక్తులు దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేయడంతో పాటు మల్లికార్జునస్వామి, సీతారామచంద్రస్వామి, ఖండేలరాయుడు, నందీశ్వరులను దర్శనం చేసుకున్నారు. స్వామివారికి తలనీలాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, వైస్ చైర్మన్ బత్తుల రమేశ్‌బాబు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

- **సదస్సు జయప్రదం చేయండి**

రామగుండం: మహాత్మా జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ కుల నిర్మూలన సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి నరేశ్ కోరారు. ఆదివారం అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. 24 నుంచి 30వ తేదీ వరకు జరిగే సదస్సును విజయవంతం చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి కె.రాజన్న, ఐ.కృష్ణ, ఎం.చంద్రయ్య, కొల్లూరి మల్లేశ్ ఉన్నారు.

- **గీత కార్మికుడికి తీవ్రగాయాలు**

పాలకుర్తి: మండలంలోని కుక్కలగూడూర్ గ్రామానికి చెందిన పల్లె నారాయణ ప్రమాదవశాత్తు ఈత చెట్టుపై నుంచి కింద పడడంతో గాయాలయ్యాయి. నారాయణ రోజులాగే కల్లుగీసేందుకు సమీపంలోని ఈతవనానికి వెళ్లాడు. నిచ్చెన సాయంతో ఈతచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో నారాయణకు గాయాలు కాగా గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు.

- **మహిళలకు కుట్టుశిక్షణ పరికరాలు పంపిణీ**

రామగిరి: మండలంలోని కల్వచర్లలో కుట్టుశిక్షణ నేర్చుకుంటున్న మహిళలకు ఆదివారం రేండ్ల శారద కుమార్‌స్వామి దంపతులు శిక్షణ పరికరాలు అందజేశారు. మహిళలు కుట్టుశిక్షణలో మెలకువలు నేర్చుకొని ఆర్థికస్వావలంబన దిశగా ముందుకు సాగాలని కోరారు. అనంతరం మహిళలు రేండ్ల శారద కుమార్‌స్వామి దంపతులను సన్మానించారు. రేండ్ల మధుసూదన్, శివ, జగన్, బాపు, సంపత్, సూర్యం, ఓంకార్, విజయ్ పాల్గొన్నారు.

- **నూతన కార్యవర్గం ఏర్పాటు**

ధర్మారం: సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ ధర్మారం మండల కార్యవర్గాన్ని ఆదివారం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలశాఖ అధ్యక్షుడిగా బి.జలపతి, మహిళా అధ్యక్షురాలిగా జె.శ్రీదేవి, ప్రధాన కార్యదర్శులుగా కె.మల్లయ్య, ఎం.సుజాత, గౌరవాధ్యక్షుడిగా జి.వెంకటరమణారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా కృష్ణహరి, ఆర్థిక కార్యదర్శిగా బి.ప్రకాశ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సురేశ్, శ్రీలత, రామకృష్ణ, కిరణ్‌కౌర్, వంశీమోహనాచార్యులు, నరేశ్, క్రిస్టెంజిలీనా, రఫీ, సహాయ కార్యదర్శులుగా ఎ.రేవతి, భాగ్యలక్ష్మి, శ్రీనివాస్, అరుణదేవి, సంపత్, వనజ, జానకిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

- **ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల కార్యవర్గం ఎన్నిక**

సుల్తానాబాద్: ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడిగా కొడుదుల కుమారస్వామిని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల మల్లేశం ప్రకటించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా కోడూరి శారద, జనరల్ సెక్రటరీగా నల్లగొండ రమేశ్‌గౌడ్, కోశాధికారిగా శీలం లక్ష్మణ్‌తోపాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు వేల్పుల మల్లయ్య, సుల్తానాబాద్ ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఏపీవో మల్లీశ్వరి, జేఈ రాజ్‌కుమార్ కార్యవర్గాన్ని సన్మానించారు.

- **నివాళి**

రామగుండం: ఇటీవల సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పశ్చిమబెంగాల్ మాజీ సీఎం బుద్దదేవ్ భట్టాచార్యకు రామగుండం సీపీఎం ప్రతినిధులు నివాళి అర్పించారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో తొలుత అరుణ పతాకం ఆవిష్కరించారు. మహాసభ ముఖ్య అతిథి సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శంకర్, ఎం.రామాచారి, తుంగపిండి మల్లేశ్, గౌరక్కగారి శ్రీనివాస్, సత్యనారాయణ, సతీశ్, కృష్ణ, వెంకటేశ్, భీమయ్య ఉన్నారు.

- **నేత్రదానం మహాదానం**

యైటింక్లయిన్‌కాలనీ: అన్నిదానాల కెల్లా నేత్రదానం మహాదానమని సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాక అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ అన్నారు. సూర్యాపేట ఫార్మసీ కాలేజీలో ఆదివారం నిర్వహించిన నేత్ర, శరీరదాతల ఐక్యవేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి హాజరైన వివిధ సేవా సంస్థల ప్రతినిధులలో 20మంది శరీరదానానికి ముందకు రాగా వారిని అభినందించి అభినందన పత్రంతో పాటు సత్కరించారు. సూర్యాపేట జిల్లా స్పందన సేవా సంస్థ అవయవ శరీర దాతల సంఘం ఆధ్వర్యంలో జిల్లా డైరెక్టర్ కోటయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గంజి ఈశ్వరలింగం, సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి పాల్గొన్నారు.

- **ఎమ్మెల్యే తనయుని జన్మదిన వేడుకలు**

గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యే దంపతులు ఎంఎస్ రాజ్‌ఠాకూర్–మనాలి తనయుడు నిదీష్‌ఠాకూర్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బర్త్‌డే వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించారు.



రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటలో ఆర్వో ప్లాంటుకు తాళం వేసి ఉంచారు. నెలరోజుల క్రితం సాంకేతికపరమైన సమస్యలు ఎదురవడంతో నీటి ప్యూరిఫైడ్ ప్రక్రియ నిలిచిపోయింది. పంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ అధికారి స్పందించి ఆర్వో ప్లాంటును పునరుద్ధరించి గ్రామ ప్రజలకు శుద్ధి జలాలు అందించాలని కోరుతున్నారు.

వాట్సప్ చేయండి..

మా ఫోన్ నంబర్ : 97053 46608

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

సింగరేణి వార్తలు

లాభాల వాటా అంకెల గారడీ


కార్మికులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

గోదావరిఖని: లాభాల వాటా ఓ అంకెల గారడీగా మారిందని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వర్కింగ్ ప్రసిడెంట్ మాదాసు రామ్మూర్తితో కలిసి ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 కృషిభవన్‌లో కార్మికులకు కలిసి సమస్యలు తెలుసుకున్నారు. జాతీయ సంఘాలు కార్మికులను అంకెల గారడీతో మాయమాటలు చెప్పి మోసం చేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. సింగరేణి వాస్తవ లాభాలు రూ.4,701 కోట్లుగా ప్రకటించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి మనుగడ కోసం అని రూ.2,780 కోట్లు పక్కకు పెట్టి మిగతా డబ్బులకు 33శాతంగా ఇస్తున్నామని చెప్పడం సిగ్గుచేటన్నారు. గతంలో టీబీజీకేఎస్ సంఘం సింగరేణిలో అధికారం సాధించినప్పుడు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒప్పించి వాస్తవ లాభాలను కార్మికులకు అందించామన్నారు. మూడురోజుల పాటు జరిగే ఆందోళన కార్యక్రమాల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు బేతి చంద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఐ.సత్యం, ముస్కుల అనిల్‌రెడ్డి, మామిడి తిరుపతి, దాసరి శ్రీనివాస్, కూర తిరుపతి, నరేందర్, బొడ్డు రమేశ్, నరేశ్, శ్రీనివాస్, రాకేశ్, రాజు, రవి, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మకాలనీ ప్రజల సమస్యలు పరిష్కరించాలి


జెండా ఆవిష్కరిస్తున్న ముత్యంరావు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్న పేద ప్రజల సమస్యలు పాలకులు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎరవల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీలో సీపీఎం పార్టీ 4వ మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ పతాకాన్ని కృష్ణారెడ్డితో పాల్గొని ఆవిష్కరించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఇందిరమ్మకాలనీలో ప్రజాసమస్యలు పేరుకుపోయాయని, సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కొత్త కమిటీని ఎన్నుకున్నారు. సీపీఎం పార్టీ 2వ డివిజన్‌శాఖ కార్యదర్శిగా లక్ష్మారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి వ ర్గ సభ్యులు రామాచారి, నాయకులు రవీందర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సునీత, అజయ్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో 'గాయత్రీ' విద్యార్థిని ప్రతిభ


ప్రశంసపత్రం అందుకుంటున్న లయవర్ధిని

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని గాయత్రీ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని చంద్రకార్ లయవర్ధిని రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో సత్తా చూపింది. ముచ్చింతల్‌లోని చినజీయర్‌స్వామి ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో జీయర్‌స్వామి చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకుందని విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ తెలిపారు. ప్రిన్సిపాల్ విజయ్ రజియుద్దిన్ విద్యార్థిని అభినందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పాలకుర్తి: బసంత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1984 నుంచి 1994వ బ్యాచ్ వరకు పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. త్వరలో నిర్వహించనున్న పది బ్యాచ్‌ల పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమ నిర్వహణ కమిటీని ఎన్నుకున్నారు.

మరమ్మతు చేయండి



జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంట నుంచి ఖిలావనపర్తికి వెళ్లే రోడ్డును మూడేళ్ల క్రితం రూ.3.5కోట్లతో నిర్మించేందుకు పనులు చేసిన గుత్తేదారు, రోడ్డు నిర్మించి, తారు వేయకుండానే వదిలిపెట్టారు. నెలక్రితం కురిసిన వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు చేసిన గుత్తేదారు వెంటనే గండ్లను పుడ్చాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బెంచీలు అందజేత

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ప్రజల సౌకర్యార్థం లయన్స్ క్లబ్ గోదావరిఖని శతాబ్ది వారి ఆధ్వర్యంలో బెంచీలను అందించారు. ఆదివారం శతాబ్ది లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని లయన్ కంకణాల శ్రీదేవి ముకుందారెడ్డి తెలియజేయడంతో ఆమె బెంచీలను అందించారు.